## బస్సు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

- నాగర్‌కర్నూల్ డీటీవో ఎర్రిస్వామి



ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లను సన్మానిస్తున్న డీటీవో, డిపో మేనేజర్

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబర్ 15: డ్రైవర్లు బస్సు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని డీటీవో ఎర్రిస్వామి అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో గతనెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లకు మెమెంటో అందజేసి సన్మాన కార్యక్రమాన్ని డిపో మేనేజర్ దేవరాజుతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చాలని, బస్సు నడిపేటప్పుడు ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం సురక్షితమని పేర్కొన్నారు. డిపో మేనేజర్ దేవరాజు మాట్లాడుతూ.. ఈనెల 19వ తేదీన కురుమూర్తి జాతర ఉన్నందున నాగర్‌కర్నూల్ డిపో నుంచి 18వ తేదీనుంచి 20వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్యను పెంచుతామని తెలిపారు. అదేవిధంగా 25వ తేదీ రాత్రి 9గంటలకు నాగర్‌కర్నూల్ డిపో నుంచి అరుణాచలంకు సూపర్ లగ్జరీ సర్వీస్ బయల్దేరుతుందని, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని 26వ తేదీ రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 27న సాయంత్రం అరుణాచలం నుంచి బయల్దేరి 28వ తేదీ ఉదయం 7గంటలకు నాగర్‌కర్నూల్‌కు చేరుకుంటుందని తెలిపారు. అవకాశాన్ని భక్తప్రయాణికులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజ్ ఏఎంఎఫ్ భాస్కర్, ఏడీసీ పరశురాం, యాదయ్యతోపాటు నారాయణ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వ్యయ, సాధారణ పరిశీలకులుగా ఇద్దరు అధికారుల కేటాయింపు

కల్వకుర్తి, నవంబర్ 15: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల వ్యయ, సాధారణ పరిపాలనకు ఇద్దరు అధికారులను ఎన్నికల సంఘం నియమించిందని ఆర్డీవో, ఆర్వో శ్రీను తెలిపారు. సాధారణ పరిశీలన అధికారిణిగా శిల్పాశర్మ(ఐఏఎస్ 9030181777), ఎన్నికల వ్యయ పరిశీలన అధికారిగా వినోద్‌కుమార్ అహిర్యార్ (ఐఆర్ఎస్ 9030161777)ను ఎన్నికల సంఘం కేటాయించిందని ఆర్వో పేర్కొన్నారు.

# ఆసరా ఆనందం

- పండుటాకులు, ఒంటరి మహిళలకు చేయూత
- జిల్లాలో 72,702 మంది లబ్ధిదారులు
- ప్రతి నెలా పింఛన్లకు రూ.16.60 కోట్లు
- బ్యాంకులు, పోస్టాఫీసుల్లో నగదు పంపిణీ
- ఖాతాల్లేని వారికి వేలిముద్ర, సంతకంతో..
- బీఆర్ఎస్‌కు జై కొడుతున్న పింఛన్‌దారులు



గద్వాల, అక్టోబర్ 15: ఆసరాతో అమ్మలు ఆనందంగా ఉన్నారు. గత ప్రభుత్వాలు రూ.200, రూ.500 పింఛన్ అందించేవి.. అయితే అవి వారికి దేనికీ సరిపోకపోవడంతో నానా అవస్థలు పడేవారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి చేయూతనివ్వాలని భావించి సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచాడు. పెంచిన పింఛన్ వారికి కొండతం అండను ఇచ్చింది. వాస్తవంగా వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులపై ఆధారపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళల బాధలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకొని గతంలో ఉన్న పింఛన్‌ను రెట్టింపు చేస్తూ 2019 జూన్ నుంచి అర్హులైన వారందరికీ పింఛన్లు రూ.2016, దివ్యాంగులకు రూ.3016 అందించారు. ప్రస్తుతం ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్‌తో వృద్ధులతోపాటు ఒంటరి మహిళలు వితంతువులు, దివ్యాంగులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎవరి మీద ఆధారపడకుండా తమ ఖర్చులకు ఎవరి యాచించకుండా ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్‌తో హాయిగా బతుకుతున్నారు. పింఛన్ రాని సమయంలో వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి ఇబ్బందిగా ఉండేది. వీరిని ఎవరూ అంతగా పట్టించుకునేవారు కాదు. ప్రభుత్వం అందజేస్తున్న ఆసరాతో వారు ధైర్యంగా బతుకుతున్నారు. దీనికి కారణం ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛనే. ప్రస్తుతం దివ్యాంగులకు ఇస్తున్న ఆసరా పింఛన్‌ను రూ.4,016కు పెంచడంతో వారి వైద్యం ఖర్చులతోపాటు ఇతర అవసరాలకు అది ఉపయోగపడుతుండడంతో వారి జీవితం సాఫీగా సాగుతుంది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఒకరి మీద ఆధార పడకుండా ప్రభుత్వం అందించే పింఛన్‌తో హాయిగా జీవిస్తున్నారు. వీరందరూ ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పింఛన్‌లు అందించగా యావత్ తెలంగాణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లాలో ప్రస్తుతం

ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశ పెట్టిన ఆసరా పథకం ద్వారా జిల్లాలో 72,616 మంది లబ్ధిపొందుతున్నారు. వీరిలో వృద్ధులు 26, 461, వితంతువులు 30,159, చేనేత కార్మికులు1,625, దివ్యాంగులు11,757, బీడీ వర్కర్స్ 51, ఒంటరి మహిళలు 2,187, గీతాకార్మికులు 396, డయాలిసిస్ రోగులు 66మంది ఉన్నారు. వీరందరికీ ప్రతినెలా ప్రభుత్వం రూ.16,60,36,152ను నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తుంది. పారదర్శకంగా కొనసాగుతున్న ఆసరా పథకంతో వీరందరు లబ్ధిపొందుతున్నారు. ఆసరా పథకాన్ని ప్రభుత్వం బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నది.బ్యాంకుఖాతాలు ఉన్నవారికి బ్యాంకులో ప్రభుత్వం డబ్బులు జమచేసిన తర్వాత అధికారులు కేవలం లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు అందజేస్తున్నారు. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ప్రతినెలా ల బ్ధిదారుల జాబితాను పరిశీలించి ఆమోదం తెలిపిన తర్వా తే లబ్ధిదారులకు ఆసరా పథకం ద్వారా డబ్బులు అందనున్నాయి.పోస్టాఫీసుల ద్వారా కూడా ఇదే పద్ధతితో ఆసరా పథకం లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందజేస్తున్నారు. గ్రామాల్లో బ్యాంకు ఖాతాలు లేనివారికి అధికారులు ప్రతినెలా వేలిముద్ర,సంతకం ద్వారా ధ్రువీకరణ చేసుకుని ఆస రా డబ్బులు అందజేస్తున్నారు.

### ఒంటరి మహిళకు అండగా కేసీఆర్



సమాజంలో ఒంటరి మహిళల పరిస్థితి ఇబ్బందిగా ఉంది. అటు తల్లిదండ్రులు పట్టించుకోక.. ఇటు మెట్టినింటి వారు ఆదరరించక ఇబ్బందులు పడేవారు. కూలి చేస్తే వచ్చే డబ్బుతో జీవనం కొనసాగించేవాళ్లం. ప్రస్తుతం వయస్సు పైబడడంతో కూలీ పనులకు వెళ్ల లేం. ప్రభుత్వం అందజేస్తున్న ఒంటరి మహిళా పింఛన్ మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. సీఎం కేసీఆర్ మాకు అండగా నిలిచారు.

**- ఏమేలమ్మ, జమ్మిచేడు**

### పింఛన్ పైసలతో మందులు కొంటున్నా..



గతంలో ప్రతిదానికి ఇంట్లోవారిపై ఆధారపడాల్సి వచ్చేది. పండుగలకు మనవడు, మనవరాలు వస్తే వా రు అడిగితే ఇవ్వడానికి నా వద్ద చిల్లిగవ్వ ఉండేది కాదు. ప్రతినెలా రూ. 2,016 పింఛన్ వస్తుండడంతో ప్రస్తుతం అన్నింటికీ ఆసరాగా ఉంటోంది. పింఛన్ డబ్బుల తోనే మందులు ఇతరాలు కొనుగోలు చేస్తున్నా. ఇంటికి ఆడబిడ్డ, వారిపిల్లలు వస్తే అంతోఇంతో ఇస్తున్నాం. వారు సంతోషపడుతున్నారు.

**- బీసమ్మ, వృద్ధురాలు, జమ్మిచేడు**

# సమిష్టి కృషితోనే స్వేచ్ఛాయుత ఎన్నికలు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించాలి
- ఈవీఎంల నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన అవసరం
- అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు సతీశ్‌కుమార్

నాగర్‌కర్నూల్, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా సాగేలా సెక్టోరియల్ అధికారులు ఎన్నికల యంత్రాంగం సమిష్టిగా చర్యలు తీసుకోవాలని కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గల సాధారణ ఎన్నికల పరిశీలకులు సతీశ్‌కుమార్ సూచించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరం లో బుధవారం కొల్లాపూర్, అచ్చంపేట, నియోజకవర్గల సెక్టోరియల్ అధికారులతో ఆయన ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి పదినుంచి 12పోలింగ్ స్టేషన్ల కు ఒక సెక్టోరియల్ అధికారి పూర్తి బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ స్టేషన్ల మ్యాపింగ్, ఏరియా మ్యాపింగ్ తదితర పూర్తిసమాచారంతో ఉండాలని కోరారు. పోలింగ్‌స్టేషన్ 200 మీటర్లలోగా ఎవరినీ అనుమతించకూడదని సూచించారు. స మస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృ ష్టి కేంద్రీకరించాలన్నారు. ముఖ్యంగా పదర, అమ్రాబాద్, చిన్నంబావి, పాన్‌గల్ మండలాల పరిధిలో పనిచేసే సెక్టోరియల్ అధికారులు అత్యంత జాగ్రత్తగా విధులు ని ర్వహించాలన్నారు. ఎన్నికలకు అఘాయిత్యం కల్పించే ఎలాంటి చర్యలనైనా ఉపేక్షించకూడదన్నారు. సెక్టోరియల్ అధికారుల పరిధిలో అదనపు ఈవీఎంలను అత్యంత జాగ్రత్తగా చూడాలన్నారు. పోలింగ్‌కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, విద్యుత్, వెబ్‌కాస్టింగ్ కోసం త్రీపిన్ సాకెట్లు, టాయిలెట్‌లు, ఫర్నీచర్, టెంట్ ఏర్పాటుపై సమీక్షించారు. మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పోలింగ్‌కేంద్రాలకు వె ళ్లే రూట్లపై అవగాహన ఉండాలని, పోలింగ్‌స్టేషన్, నియోజకవర్గ నెంబర్ సూచిస్తూ పెయింటింగ్ వేశామని, ఎక్కడైనా పెండిం గ్ ఉంటే త్వరగా పూర్తిచేయాలని కోరారు. పోలింగ్‌రోజున చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఈవీఎంలు, ఈవీఎంలకు సీలింగ్ వేయడం, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో సామగ్రి పంపిణీ, మాక్‌పోల్, మాక్‌పోల్ సర్టిఫికెట్ జారీపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, శిక్షణ పర్యవేక్షణ నోడల్ అధికారి నర్సింగ్‌రావు, ఎల్‌డీఎం కౌశీల్‌కిశోర్ పాండే, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసులు, డీటీ బాలరాజు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పరిశీలకులు సతీశ్‌కుమార్



పాల్గొన్న సెక్టోరియల్ అధికారులు

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి
- కేంద్ర ఎన్నికల పరిశీలకులు సుశాంక్ గోయల్

ఖిల్లాఘణపురం, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు సుశాంక్ గోయల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ పరమేశ్‌తో మండలంలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులు, వృద్ధులకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ముందే గుర్తించి వాటికి కావాల్సిన ఏర్పాట్లు పూర్తిచేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు వీల్ చైర్స్, వలంటీర్లను ఏర్పాటు చేసి వారికి తోడ్పాటునందించాలన్నారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా బూత్ లెవల్ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం పోలింగ్ అయ్యేలా చూడాలన్నారు. ఆయనతోపాటు ఆర్ఐ గణేశ్, డీటీ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లా ఘనపురంలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై ఆరాతీస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు